క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 31వ వార్డు బసవన్న గడ్డలో మంగళవారం మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాన్స్‌కో అధికారులు స్థానిక కౌన్సిలర్ రాధాకృష్ణతో కలిసి ప్రారంభించారు. కాలనీలో లోఓల్టేజీ సమస్య ఉందని ఏఈ అధికారి దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఆయన లైన్‌మెన్, కాంట్రాక్టర్‌కు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అడిగిన వెంటనే సమస్యను సమస్య పరిష్కరించిన ఏఈ, కౌన్సిలర్‌కు కాలనీ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య, నజీర్‌బాషా, నరేష్, కాంట్రాక్టర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



చిన్నంబావి: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డిని మంగళవారం సర్పంచ్ రంజిత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు అందరి సహకారం అవసరం అన్నారు. మండలంలో అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునిస్వామి, క్రిష్ణ, మద్దిలేటి, చిరంజీవి, వేణు, మల్లేష్, వంశీ, మధు, జితేందర్, తేజ, వెంకట్, అరవింద్, బాబి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ప్రభుత్వానికి అప్పగించాలి



మదనాపురం: ప్రభుత్వం కేటాయించిన 2022–23 వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎమ్మార్ బియ్యాన్ని తక్షణమే ప్రభుత్వానికి అప్పగించాలని తహసీల్దార్ నరేందర్ మిల్లర్లకు సూచించారు. లేకుంటే ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గోవిందహళ్లీ సమీపంలోని గాయత్రి పారా బాయిల్డ్ రైస్‌మిల్‌ను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వ కళాశాల మంజూరు చేయండి

అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏబీవీపీ మండల కన్వీనర్ అఖిల్, రాజేష్, సందీప్, మహేష్, రాజేష్, సాయి, విగ్నేష్, కార్తీక్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఫిర్యాదు



ఆత్మకూర్: ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం బస్తాల్లో ఐదు నుంచి పది కేజీల వరకు బియ్యం తక్కువగా వస్తున్నాయని రేషన్ డీలర్లు తహసీల్దార్ సింధూజకు ఫిర్యాదు చేశారు. మంగళవారం డీలర్లు తహసీల్దార్‌ను కలిసి తమగోడును వెళ్లబోసుకున్నారు. ప్రతి నెల ఇదే తంతు జరుగుతుందని, బియ్యం సరఫరా చేసే కాంట్రాక్టర్ తాను గద్వాల ఎమ్మెల్యే మనిషినని తమను దబాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని తహసీల్దార్ హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్ఎస్ గోదాం ఇన్‌చార్జీ మహేష్, డీలర్లు బాలస్వామి, సత్యన్న, నర్సింగ్ ఉన్నారు.

ఆలయానికి రూ.10,115 విరాళం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో గల అభయాంజనేయ, రామలింగేశ్వర ఆలయానికి రూ.10,115 విరాళాన్ని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి ఆలయ కమిటీ నిర్వాహకులకు మంగళవారం సాయంత్రం అందజేశారు. ప్రజలకు దేవుడిపై భక్తి ఉండాలని, ఆలయంలో సౌకర్యాలు కల్పించేందుకు దాతలు విరాళం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు పాకనాటి కృష్ణ, సదుర్ల రమేష్, ఎల్ఐసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

- గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని తగ్గించాలి
- జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి ముందుకెళ్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి రూ.కోట్లు మంజూరు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేసి క్రీడా ప్రాంగణాలతో పాటు వైకుంఠధామాలను నిర్మించారన్నారు.

గ్రామాలకు రూ.20లక్షలు మంజూరు

సీఎం ప్రత్యేక నిధులతో ఒక్కొక్క పంచాయతీకి రూ.20 లక్షలు మంజూరు చేశారని, వీటి ద్వారా గ్రామాల్లో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా అందించే తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు నుంచి వినతులు వస్తున్నాయని, అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇంటి ఆవరణలో ఉన్న వ్యక్తిగత కుళాయిలకు ఆన్ ఆఫ్ లను బిగించుకోవాల్సిన అవసరం ఉందని, వీటి కోసం గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మొక్కలను కరెంటు స్తంభాల కింద నాటొద్దు

ప్రభుత్వ ఉన్నత లక్ష్యంతో హరితహారం ద్వారా మొక్కలను నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కానీ మొక్కలను విద్యుత్ స్తంభాల కింద నాటడంతో పెరిగిన తర్వాత కరెంటు తీగలకు తగిలి విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తెచ్చారు. దీంతో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే స్పందిస్తూ మొక్కలను నాటే సమయంలో జాగ్రత్తలు పాటించి, కరెంట్ స్తంభాలకు దూరంగా నాటాలని అధికారులకు సూచించారు. ఏడేళ్ల కింద నాటిన మొక్కలు పెరిగి విద్యుత్ తీగలకు తాకడంతో ఈదురు గాలులకు, వర్షం పడినప్పుడు సమస్య తీవ్రంగా ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు వివరించారు.

వాణిజ్య పంటల సాగు మేలు

రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి, వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని సూచించారు. వీటిపై నిరంతరం వ్యవసాయ, ఉద్యానవన అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుపై సబ్సిడీ ఇస్తుందని, వీటి సాగుతో కలిగే లాభాల గురించి వివరించాలన్నారు. చిరుధాన్యాల సాగులో సైతం అధిక లాభాలు ఉన్నాయని, రైతులు సాగునీటి వినియోగం తక్కువగా ఉండి ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి, జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, ఎంపీడీఓ జ్యోతి పాల్గొన్నారు.

నీటి లభ్యత ఉన్నచోటే మానవ మనుగడ



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందులాల్ పవార్

ఖిల్లాఘనపురం: భూమిపై ఎక్కడ నీటి లభ్యత ఉంటుందో అక్కడే మానవ మనుగడ, నాగరికత ఉంటుందని కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ అన్నారు. గణపసముద్రం చెరువును రిజర్వాయర్‌గా మార్చడం వల్ల రైతులకు కలిగే లాభం, నష్టం, నీటిమునక, కట్ట, అలుగు ఎత్తు పెంపు తదితర విషయాలపై మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ముందుగా రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. గణపసముద్రం చెరువుగానే ఉంచడం ద్వారా యాసంగిలో నీరు తక్కువగా ఉండడంతో శిఖం భూమిలో పంటలు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నామని, రిజర్వాయర్‌గా మార్చితే ఆ అవకాశం కోల్పోతామని రైతులు వాపోయారు. భూమి తమ పేరున రిజిస్టరై ఉన్నందున రైతుబంధు డబ్బులు, బీమా సౌకర్యం ఉండటంతో పాటుగా బ్యాంకుల్లో రుణాలు కూడా పొందే అవకాశం ఉందన్నారు. రిజర్వాయర్‌గా మార్చితే భూ యాజమాన్య హక్కులు మారి తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల సమస్యలపై కలెక్టర్, నీటిపారుదల శాఖ ఎస్సీ మాట్లాడారు. ప్రస్తుతం చెరువు విస్తరణ 600 ఎకరాల్లో ఉందని, కేవలం కొత్తగా 30ఎకరాల భూమినే రిజర్వాయర్‌కు తీసుకుంటున్నామని వివరించారు. కానీ దీని వల్ల నీటి నిల్వ సామర్థ్యం 0.46 టీఎంసీకి పెరుగుతుందన్నారు. చెరువులో కొంత సాగుభూమి మునడం వలన రిజర్వాయర్ కింద 5,281 ఎకరాల భూమి సాగులోకి వస్తుందని తెలిపారు. రైతులకు సమస్యను ప్రభుత్వానికి నివేదించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

రైతులతో మాట్లాడేందుకు మంగళవారం కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ వస్తున్న విషయం తెలియడంతో మండల కేంద్రంలోని బస్టాండు నుంచి రైతువేదిక వరకు 'రిజర్వాయర్ వద్దు, చెరువే మాకు ముద్దు' అనే ఫ్లెక్సీలను రైతులు ఏర్పాటు చేశారు.

ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర రైస్‌మిల్లును పరిశీలించారు. మిల్లులో నిల్వ ఉన్న వడ్ల బస్తాలు, బియ్యం తదితర వాటి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఎస్టీ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందిస్తున్న భోజనం, విద్యా బోధన, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వాటి వివరాలను తెలుసుకున్నారు.

విద్యా రంగంపై నిర్లక్ష్యం వద్దు



వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎనిదేళ్లుగా విద్యా రంగాన్ని గాలికి వదిలేసిందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా కన్వీనర్ జగదీశ్ ఆరోపించారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా విద్యారంగంపై శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించకపోతే, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, రూ. 5,300 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ అధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ భవిత, నాయకులు ప్రణీత, పవన్, మణి, శ్రీకాంత్, శివ, అరవింద్, బంగారు బాబు, హరీష్, కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం మరువలేనిది

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ అభివృద్ధికి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని ఉప సర్పంచ్ నాగరాజునాయుడు అన్నారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే అందించిన రూ.20 లక్షల ప్రత్యేక నిధులతో చేపట్టిన మూడు కల్వర్టులు, ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అందించిన ప్రత్యేక నిధులతో బండపల్లి నుంచి జమ్మాపూర్ వరకు రోడ్డు మధ్యలో మూడు కల్వర్టులు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కల్వర్టులు లేక వర్షాకాలంలో ప్రయాణానికి ఇబ్బందులు ఉండేవని, వీటి నిర్మాణంతో ఇబ్బందులు తొలుగుతాయని తెలిపారు. నిధులు మంజూరుకు సహకరించిన ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జ్యోతినందన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న డ్రెయినేజీ

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన హరిజన్ రాజు కొంతకాలంగా కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. స్థానిక టీఎమ్మార్ యువజన సభ్యుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎంపీపీ మేఘారెడ్డి మంగళవారం రాజు ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. రానున్న రోజుల్లో అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో టైలర్ రవి, హన్మంత్, దస్తగిరి, రాఘవేంద్ర, పీఏసీఎస్ డైరెక్టర్ మన్యంకొండ, వెంటస్వామి తదితరులు ఉన్నారు.

మూడు రోజుల పాటు నీటి సరఫరా బంద్

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు కారణంగా కిష్టాపూర్‌తండా ట్యాంక్ పరిధిలోని గ్రామాలకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని ఏఈ సూచించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం, కోతులకుంటతండా, సల్కెలాపురం, తిర్మలాయపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు జిల్లా కాంగ్రెస్ సోషల్‌మీడియా కో ఆర్డినేటర్ దేవన్నయాదవ్ తెలిపారు. మండల రైతు కమిటీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లోకి చేరనుండడంతో మంగళవారం వారితో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి చిన్నారెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు.



కార్మికులందరికీ వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: ప్రభుత్వ ఆదేశాలతో లేబర్ కార్డు ఉన్న వారందరికీ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడం సంతోషకరమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలైన కార్మికులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి ఉచితంగా వైద్యం అందిచనున్నట్లు తెలిపారు. పట్టణంలో లేబర్ కార్డులు ఉన్న 1,426 మందికి ఐదు రోజుల పాటు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మహమ్మద్ ఖాజా, క్యాంపు డాక్టర్ విజయ్, క్యాంపు జిల్లా కోఆర్డినేటర్ నాగేష్, క్యాంపు కోఆర్డినేటర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అశ్వని రమేష్

పాన్‌గల్: జిల్లాలోని నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారంతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశ్వని రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సంఘం భవనంలో జిల్లా నాయీ బ్రాహ్మణుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా అభివృద్ధి చెందాలన్నారు. ఐకమత్యంతో పనిచేస్తూ హక్కుల సాధన కోసం పోరాటాలు కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం కుల వృత్తులకు అందిస్తున్న రూ.లక్ష చేయూతలో నాయీ బ్రాహ్మణులకు ప్రతి గ్రామంలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మండల కేంద్రంలోని సంఘం భవనానికి ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 5 లక్షలు కేటాయించాలని కోరుతూ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సదుర్ల కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సదుర్ల నాగరాజు, బాలరాజు, మండల అధ్యక్షుడు సదర్లు రమేష్, గౌరవ అధ్యక్షుడు తిరుపతయ్య, ఆంజనేయులు, మహేష్, మంజు, విష్ణు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను ఉద్యోగులుగా పరిగణించాలి



కొత్తకోట: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ జీఓ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, ఆపరేటర్లకు, డ్రైవర్లకు, కారోబార్లకు, బిల్ కలెక్టర్లకు రూ.19,500 చెల్లించాలన్నారు. ప్రమాద బీమా కింద ప్రతి కార్మికుడికి రూ.10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించి అక్రమంగా తొలగించిన జీఓ 51ని సవరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు నాగేష్, భాస్కర్, శ్యాంసుందర్, సహదేవుడు, నిరంజన్, మన్యంకొండ, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

మహనీయులకు ఘన నివాళి



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: మహనీయుల పోరాటాన్ని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో అల్లూరి సీతారామరాజు జయంతిని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ.. బ్రిటీషర్ల పాలనకు ఎదురు తిరిగి పోరాడిన అల్లూరి సీతారామరాజు, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం వీరమరణం పొందిన దొడ్డి కొమురయ్య పోరాటాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, మండ్ల దేవన్న నాయుడు, తగువుల వెంకటస్వామి, ఉత్తరయ్య, విభూది ఈశ్వర్, నిదర్శన్‌గౌడ్, సూర్యనారాయణ చారి, పరమేశ్వరచారి, సత్యంచారి, మురళీధర్ చారి, వెంకటయ్యచారి, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలపై అవగాహన ఉండాలి



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని కొత్తకోట వ్యాపుల్స్ స్కూల్‌లో బీహెచ్ఈఎల్ దాతుర్మాస దీక్షలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో పంచముఖి దేవాలయాన్ని కొత్తకోట, షాద్‌నగర్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా విజయానంద తీర్థ స్వామి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి భవిష్యత్తును ఎంచుకోవాలని, దేశ సంస్కృతి సాంప్రదాయాల గురించి చిన్నప్పటి నుంచే తెలుసుకోవాలని సూచించారు. స్కూల్ చైర్మన్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ చంద్రహాసన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పారామెడికల్ సిబ్బంది ఆత్మీయ సమ్మేళనం



వనపర్తి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో రెగ్యులర్ అయిన పారామెడికల్ సిబ్బందికి మంగళవారం జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని టీఎన్‌జీఓ జిల్లా శాఖ, టీఎన్‌జీఓ మెడికల్, హెల్త్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు టీఎన్‌జీఓ జిల్లా గౌరవ అధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఎదురైనా సంఘం తోడుంటుందని, సంఘం నిర్వహించే కార్యక్రమాలకు ఉద్యోగులు తోడ్పాటు అందించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మామిల రాజేందర్, రాష్ట్ర కార్యదర్శి మారం జగదీశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజు, మహేశ్వర చారి, రవీందర్‌గౌడ్, చిట్టెమ్మ, చంద్రయ్య, శ్రీనివాసులు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

పాన్‌గల్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవిప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన శ్రీనివాసులు (31) అనే వ్యక్తి హైదరాబాద్‌లో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల క్రితం హైదరాబాద్ నుంచి సొంత గ్రామానికి వచ్చిన ఆయన.. హైదరాబాదుకు వెళ్తున్న అని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఈ క్రమంలో తప్పిపోయి కర్ణాటక వెళ్లే రైలు ఎక్కిన.. మళ్లీ హైదరాబాద్‌కు వస్తున్నా అని చెప్పినా ఇంతవరకు ఆచూకీ లేదు. దీంతో తల్లి రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అతడి ఆచూకీ లభిస్తే సెల్ నంబర్ 87126 70616 సమాచారం ఇవ్వాలని కోరారు.